సాక్షి
జనగామ

గురువారం । 9 । అక్టోబర్ । 2025



విద్యుత్ వినియోగం తగ్గింది

వరుసగా వర్షాలు కురియడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిందని టీజీఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు.

- 8లో



ట్రాఫిక్ నియంత్రణకు కలిసి పనిచేద్దాం

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం $31^{\circ}/23^{\circ}$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఒకటి ,రెండు చోట్ల గాలులతో కూడిన చిన్నపాటి వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు హోమియో ఉచిత వైద్యశిబిరం

జనగామ రూరల్: ఈనెల 10వ తేదీన పట్టణంలోని ధర్మకంచలో ఉన్న యూపీహెచ్‌సీలో ఉదయం 10 గంటల నుంచి హోమియో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మమత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రామంతాపూర్ ప్రభుత్వ హోమియో కళాశాల ఆధ్వర్యంలో జిల్లాలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారని చెప్పారు. మోకాళ్ల నొప్పులు, నడుమునొప్పి, మధుమేహం, రక్తపోటు తదితర దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందజేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీసోమేశ్వరాలయం హుండీ ఆదాయం రూ.26,27,977



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.26,27,977 సమకూరినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు తెలిపారు. బుధవారం ఆలయ కల్యాణమండలంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ భువనగిరి ఇన్‌స్పెక్టర్ ఎస్.నిఖిల్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది మార్చి 21 నుంచి బుధవారం వరకు హుండీలో భక్తులు సమర్పించిన 201 రోజుల కానుకల ఆదాయాన్ని లెక్కించారు. అమెరికా కరెన్సీ నోట్లు 32(317 డాలర్లు), ఉగాండా 1 (5000 సీలింగ్స్), ఇంగ్లాండ్ 1 (5 ఫౌండ్స్), కొరియా ఓన్ 1(1000), యూరోపియన్ 1(10) యూరోలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి లక్ష్మన్న, సిబ్బంది, శ్రీసోమేశ్వర, రాజరాజేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

లాయర్ కిషోర్‌దాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



జనగామ రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిచేసిన లాయర్ కిషోర్‌దాస్‌పై కఠిన చర్యలు తీసుకొని భారత రాజ్యాంగాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని నెహ్రూ పార్కు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మహిళలు, ఆదివాసులు, మేధావులు, ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. దేశంలో ప్రధాన న్యాయమూర్తికి కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సుంచు విజేందర్, పుట్కనూరి ఉపేందర్, బోడ నరేందర్ , బొట్ల శ్రావణ్, కళ్యాణం లింగం, పాము శ్రీకాంత్, గడ్డం యాదగిరి, సౌందర్య, బైరగోని మల్లేశం తదితరులు పాల్గొన్నారు

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రోద్బలంతోనే..

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రోద్బలంతోనే చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి జరిగిందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ ఆరోపించారు. బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో తుటి దేవదానం, బొట్ల శ్రావణ్‌కుమార్, పొన్నగంటి చిరంజీవి, గండి నాగరాజు పాల్గొన్నారు.

పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుతో ఎంఓయూ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుతో ఎంఓయూ చేసుకున్నట్లు బుధవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. ఈ ఎంఓయూతో విద్యార్థులకు పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా ఇంటర్న్‌షిప్ పొందే అవకాశం ఏర్పడిందన్నారు. భారత ప్రభుత్వంతో ఆమోదించబడిన ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ హనుమకొండ బ్రాంచ్ ద్వారా ఈ ట్రైనింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు కూడా అందజేస్తారని జ్యోతి వెల్లడించారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ హనుమకొండ డీహెచ్‌ఎస్‌డీ ప్రమోద్ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ అధికారి డాక్టర్ ఎల్.జితేందర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌ఎం రెహమాన్, ఫిజిక్స్ విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ వరలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ ఎ.సరిత, డాక్టర్ బి.సరిత, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడతకు రెడీ

- జిల్లాలో ఆరు మండలాలు, ఆరు జెడ్పీటీసీలు, 70 ఎంపీటీసీలు
- ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్లు
- కలెక్టర్లతో వీసీలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- కలెక్టరేట్‌లో ఫిర్యాదుల కోసం హెల్ప్ డెస్క్–93908 30087

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ విడుదల



వీసీలో కలెక్టర్, పక్కన ఉన్నతాధికారులు

మొదటి విడత జెడ్పీటీసీ రిటర్నింగ్ ఆఫీసర్లు	
మండలం	ఆర్‌ఓ
చిల్పూరు	కె.అంబికాసోని
కొడకండ్ల	ఎన్. లక్ష్మీనర్సింహారావు
పాలకుర్తి	కోదండరాములు
స్టేషన్‌ఘన్‌పూర్	ఎన్.రాణాప్రతాప్
దేవరుప్పుల	బి.శ్రీధర్‌రావు



దేవరుప్పుల మండల పరిషత్ కార్యాలయం

జనగామ: స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు గురువారానికి వాయిదా వేయగా, ఎలక్షన్ కమిషన్ మాత్రం నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి పనులు చక్క బెడుతోంది. ఇందుకు సంబంధించి బుధవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి కలెక్టర్లతో ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుమిదిని వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వీసీలో పాల్గొన్నారు. గురువారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ తర్వాత నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని వీసీలో ఆమె ఆదేశించారు.

మొదటి విడతలో 70 ఎంపీటీసీలు, ఆరు జెడ్పీటీసీలు

జిల్లాలో మొదటి విడతలో ఎంపీటీసీ, జెడ్పీటీసీకి సంబంధించి 6 మండలాల పరిధిలో 70 ఎంపీటీసీలు, 6 జెడ్పీటీసీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించి జెడ్పీటీసీ ఆర్‌ఓలు 15(అదనపు కలుపుకుని), ఎంపీటీసీ ఆర్‌ఓలు 55 ఆధ్వర్యంలో ఇతర సిబ్బందితో కలిసి నామినేషన్లను స్వీకరిస్తారు. దేవరుప్పుల 12 ఎంపీటీసీలు, పాలకుర్తి 17, కొడకండ్ల 9, లింగాలఘనపురం 11, చిల్పూర్ 12, స్టేషన్‌ఘన్‌పూర్ 9 స్థానాలకు పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి 417 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

2.12లక్షల మంది ఓటర్లు

ఆరు మండలాల పరిధిలో మొదటి విడతలో జరిగే ఎన్నికల్లో 2, 12, 117 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,04,974 పురుష ఓటర్లు, 1,07,139 మహిళా ఓటర్లు, ఇతరులు 4 ఉన్నారు.

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ, ఎలక్షన్లు :సమీక్షలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జిల్లాలో మొదటి విడత ప్రారంభమయ్యే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలకు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రిజర్వేషన్ల కేటాయింపులకు అనుగుణంగా నోటీసు ఇవ్వడంతో పాటు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ పత్రాలను పక్కాగా చెక్ చేసుకోవాలన్నారు. ఇందులో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. తహసీల్దార్లు రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలకు సహకారం అందించాలన్నారు. కాగా ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ జాబితాను ప్రదర్శించాలని ఆదేశించారు. రోజువారీగా వచ్చిన నామినేషన్ల సమాచారాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రదర్శించాలన్నారు. బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించడంతో పాటు శిక్షణ కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల పరిధిలో(మునిసిపల్ మినహా) మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందన్నారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఇతరులకు ప్రవేశం లేదని, పోలీస్ శాఖ బందోబస్తు ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలపాటు పని చేస్తుందన్నారు. ఫిర్యాదుల కోసం–93908 30087ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీసీలో జెడ్పీ సీఈఓ మాధురీ షా, జడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత, జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ

ఆయా మండలాల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 12న నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటలకు చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 13వ తేదీన అప్పీళ్ల స్వీకరణ, 14న చివరి అప్పీళ్ల పరిష్కరణ, 15న అభ్యర్థుల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థు జాబితా వెలువరిస్తారు. 23వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

మొదటి విడత ఎన్నికలు జరిగే మండలాల పరిధిలో ఓటర్లు

మండలం	ఎంపీటీసీలు	పోలింగ్ స్టేషన్లు	పురుష (ఓటర్లు)	మహిళ	అదర్స్	మొత్తం
దేవరుప్పుల	12	68	18,610	18,723	-	37,333
పాలకుర్తి	17	106	26,189	26,675	1	52,865
కొడకండ్ల	09	61	14,202	14,468	2	28,672
లిం.ఘనపురం	11	64	16,323	17,033	-	33,356
చిల్పూరు	12	62	16,473	16,853	1	33,327
స్టే.ఘన్‌పూర్	09	56	13,177	13,387	-	26,564
మొత్తం	70	417	1,04,974	1,07,139	4	2,12,117

పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే న్యాయం

- ఆ దిశగా ప్రజలకు నమ్మకం కలిగించాలి
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి
- పాలకుర్తి పీఎస్‌లో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ వార్షిక తనిఖీ



కిట్ ఆర్టికల్ తనిఖీ చేస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

పాలకుర్తి టౌన్: పోలీస్ స్టేషన్‌కు వెళ్తే న్యాయం జరుగుతుందని ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారుల చర్యలు ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ చెప్పారు. పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సీపీ వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. పోలీసు సిబ్బంది చేసిన పరేడ్‌తో పాటు కిట్ ఆర్టికల్ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఆర్‌బీఎఫ్, హెబ్సిబా బాధితులు ఫిర్యాదు చేయండి

పాలకుర్తి ప్రాంతంలో ఆర్‌బీఎఫ్, హెబ్సిబా చైన్ సిస్టంలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఆర్‌బీఎఫ్, హెబ్సిబాపై నమోదైన కేసు ముగిసిపోలేదని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. నిందితులకు సహకరించిన ఏజెంట్‌లను వదిలే ప్రసక్తే లేదన్నారు.

న్యాయం చేయాలని బైఠాయింపు

మండలంలోని మంచుప్పుల గ్రామానికి చెందిన కాకర్ల రమేశ్ అనే వ్యక్తి తనను రెండేళ్ల క్రితం కులం నుంచి బహిష్కరించారని, అందుకు కారకులపై చర్యలు తీసుకోవాలని సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా తొర్రూరు గ్రామానికి చెందిన గుర్రం వెంకటమ్మ అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ప్రహరీ నిర్మిస్తుండగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అన్యాయంగా కూల్చారని, తనకు న్యాయం చేయాలని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్యకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ ఎదుట మంచుప్పుల, తొర్రూరు గ్రామాలకు చెందిన బాధితులు కొద్దిసేపు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తమకు న్యాయం చేయాలని బైఠాయించారు. సీఐ జానకిరాంరెడ్డి జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేస్తామని సర్దిచెప్పారు.

విద్యుత్‌చౌర్యం, మొండిబకాయిలపై ప్రత్యేక నిఘా

- ట్రాన్స్‌కో ఘన్‌పూర్ ఏఈ శంకర్



తనిఖీలు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ చౌర్యం, మొండిబకాయిలపై ప్రత్యేక నిఘాతో పనిచేస్తున్నట్లు విద్యుత్‌శాఖ స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ ఏఈ శంకర్ తెలిపారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో విజిలెన్స్ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. పట్టణ పరిధిలో రూ.1.50 లక్షలు విద్యుత్ బకాయిలు వసూలు అయ్యాయన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బందితో సహకరించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో లైన్‌మన్ వాసం శ్రీధర్‌పటేల్, విజిలెన్స్ కానిస్టేబుల్స్ సతీశ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

జనగామ: రాష్ట్ర పారామెడికల్ బోర్డు 2025–26 విద్యాసంవత్సరంలో రెండు సంవత్సరాల పారామెడికల్ డిప్లొమా కోర్స్ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనగామ ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్స్ (డీఎంఐటీ), డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ (డీఓఏ) కోర్సులకు ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ అభ్యసించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. ఒకవేళ బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు లేనిచో ఇంటర్‌లో ఇతర సమాన అర్హత గల కోర్సు చేసిన వారు సైతం దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆసక్తిగలవారు పారామెడికల్ బోర్డు వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటినుంచి వేల్పుగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

జఫర్‌గఢ్: మండలకేంద్రంలో వేల్పుగొండ కొండపై వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి జరగనున్నాయి. కొండ దిగువన ఉన్న శ్రీలక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. స్వామివారిని కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు కొలుస్తుంటారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పాడిశెటి వెంకటాచార్యులు మాట్లాడుతూ..ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలతో ప్రారంభమవుతాయన్నారు. 11న శ్రీలక్ష్మీనర్సింహా సుదర్శన హోమం, పూర్ణాహుతి, అరగింపు, తీర్థగోష్ఠి, 12న శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవం, 13న స్వామివారి చక్రస్నానం, పల్లకీసేవ, సాయంత్రం సమయంలో పుష్పయాగం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు వైభవంగా జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహాజాతరకు.. 112 రోజులే

- పనుల్లో అధికారులు నిమగ్నం



సాలహారం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతరకు ఇంకా 112 రోజులే సమయం మిగిలి ఉంది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు మహాజాతర జరగనుంది. వనదేవతల గద్దెల ప్రాంగణం విస్తరించేందుకు అధికార యంత్రాంగం పనుల్లో నిమగ్నమైంది. సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ఇటీవల ఆవిష్కరించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మంత్రి సీతక్క ఆలయ ప్రాంగణం సాలహారం (ప్రహరీ)పనులపై దృష్టి సారించారు.

వంద రోజులే లక్ష్యంగా..


మేడారం అమ్మవార్ల గద్దెల ప్రాంగణ పునర్నిర్మాణ పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దింపింది. ఆలయ గద్దెల చుట్టూ సాలహారం నిర్మాణ పనులను మాస్టర్ ప్లాన్ డిజైన్ ప్రకారం రాతితో నిర్మించేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. కాగా వేలాది మంది కార్మికులను ఏర్పాటు చేసి రాత్రి, పగలు పనులు చేయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గద్దెల ప్రాంగణ విస్తీర్ణ పనులపై మంత్రి సీతక్క ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

సాలహారం నిర్మాణానికి మార్కింగ్

సాలహారం(ప్రహరీ) పనులకు అమ్మవార్ల గద్దెల ప్రాంగణం చుట్టూ ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ చేశారు. సారలమ్మ ఆర్చి ఎగ్జిట్ గేట్ ప్రహరీ నిర్మాణానికి బయట స్థలాన్ని చదును చేశారు. ప్రహరీ నిర్మాణంతో పాటు మీడియా వాచ్ టవర్ల నిర్మాణానికి కూడా మార్కింగ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ దివాకర, రోడ్లు, భవనాలశాఖ ఇంజనీరింగ్ శాఖ ఇన్‌చీఫ్ మోహన్‌నాయక్, ఎండోమెంట్ ఎస్ఈ ఓంప్రకాశ్, ఆర్కిటెక్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మేడారం గద్దెల ప్రాంగణంలో చేపట్టనున్న పనులను పరిశీలించారు. ప్రహరీ పనుల మార్కింగ్‌ను కలెక్టర్ ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు. సాలహారంతో పాటు ఎనిమిది ఆర్చి ద్వారాల నిర్మాణాలతో పాటు అదనంగా మరో ఆర్చి ద్వారం నిర్మాణంపై ఇంజనీరింగ్ అధికారులు డిజైన్ మ్యాప్‌లను చూపిస్తూ పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ పనుల్లో ఎక్కడ కూడా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల్లో తేడా రాకుండా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

సర్దుబాటుకు బ్రేక్!

- ఎన్నికల కోడ్‌కు ఎలా ముడిపెడుతారంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- గాలిలో దీపంలా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ
- విద్యాశాఖ అధికారుల తప్పిదాలతోనే కాలయాపన?
- బోధించేవారు లేక విద్యార్థులకు తీరని నష్టం



జనగామ: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మరోసారి వివాదాస్పదంగా మారుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో టీచర్ల సర్దుబాటుకు ముడిపెడుతున్నారనే ప్రచారం వినిపిస్తోంది. సర్దుబాటు కోడ్ కిందకు వస్తుందా? అంటూ ఓ ఉన్నతాధికారి అనడంలో ఆంతర్యమేంటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు సైలెంట్‌గా వ్యవహరిస్తుండడంతో ఉపాధ్యాయ వర్గాల్లో అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పక్కనబెట్టి, కాలయాపన చేస్తున్నారని పలు ఉపాధ్యాయసంఘాలు మండిపడుతున్నాయి. మొదటి విడత సర్దుబాటులో ఎంఈఓలు పలు తప్పిదాలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తగా, ఆ తప్పిదాలను సరిదిద్దడమే రెండో విడతలో ముఖ్యమని భావించారు. అయితే తాజాగా నిర్వహించిన రెండో విడత సర్దుబాటులో కూడా అదే పద్ధతి కొనసాగిందంటూ అసంతృప్తి వ్యక్తమవుతోంది.

డీఈఓగా ఐఏఎస్ అధికారి ఉన్నా..

జిల్లా విద్యాశాఖలో ఐఏఎస్ అధికారి డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా గందరగోళ పరిస్థితులపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నూతన డీఈఓ రాకతో పారదర్శకత వస్తుందని భావించినప్పటికీ, సిబ్బంది అనుమతులు, బదిలీలు, సర్దుబాట్లలో జాప్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల లీకైన అధికారుల నివేదిక ప్రకారం జిల్లాలో 94 మంది టీచర్లను సర్దుబాటు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో 70 మంది ఎస్‌జీటీలు, 20 మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు లాంగ్వేజ్ పండిట్లు ఉన్నారు.

రెండో విడతలో లోపాలు..?

ఈ ఎంపికల్లో కూడా అక్కడక్కడా లోపాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఇటీవల ఓ ఉపాధ్యాయ సంఘం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. మొదటి విడతలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ, మళ్లీ అదే పునరావృతం కావడంతోనే డీఈఓ సర్దుబాటుకు వెనకాడుతున్నారని సమాచారం. జిల్లాలో ఎంఈఓలు ఎవరి కంట్రోల్‌లో పనిచేస్తున్నారని పలువురు టీచర్లు బాహాటంగానే మాట్లాడుకోవడం కనిపిస్తోంది. మరోవైపు ఎంఈఓల పరిస్థితి కూడా క్లిష్టంగా ఉందని చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్యను పరిగణలోకి తీసుకోకుండా, టీచర్ల సర్దుబాటు చేసేందుకు పలువురు ఎంఈఓలు వెనకాడడం లేదనే ఆరోపణలు విద్యాశాఖ ప్రతిష్టను దిగజారుస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని కొడకండ్ల ఎంఈఓ ఓ విచారణ ఎదుర్కొంటుండగా, బచ్చన్నపేట మండలంలోని నక్కవానిగూడెం పీఎస్‌లో టీచర్ల నియామకం విషయంలో అక్కడి అధికారి నిర్లక్ష్యం విద్యారుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసినట్లు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక స్పందన లేదు. ఉపాధ్యాయుల సర్దుబాటుపై జరుగుతున్న ఈ అనిశ్చితి, గందరగోళం విద్యారంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.


త్వరగా పూర్తి చేయాలి



టీచర్ల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఏర్పడిన ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. కాబట్టి ఇప్పుడు తాత్కాలిక ఉపశమనంగా టీచర్ల సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉపాధ్యాయులు వస్తారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం ద్వారా విద్యార్థుల సంఖ్యను తగ్గకుండా చూడొచ్చు. జిల్లా విద్యాశాఖ త్వరగా టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి.

- రావుల రామ్మోహన్‌రెడ్డి, టీచర్, జనగామ

కుంటుబడిపోతున్న విద్యాబోధన




ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఆలస్యంతో పిల్లల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో విద్యాభ్యాసన ప్రక్రియ కుంటుపడిపోతోంది. ఒక మండలంలో ఉపాధ్యాయులు అదనంగా ఉన్నప్పటికీ వారిని కాదని పక్క మండలం నుంచి సర్దుబాటు చేయడం సరైనది కాదు. దూర ప్రాంత మండలాల నుంచి పట్టణ సమీప మండలాలకు సర్దుబాటు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఉపాధ్యాయులు అదనంగా లేని పాఠశాల నుంచి సర్దుబాటు పేరుతో పట్టణ సమీప ప్రాంతానికి డిప్యూటేషన్ ఇవ్వరాదు.

- డి.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీపీటీఎఫ్

హోటళ్లలో 'ఫుడ్‌సేఫ్టీ' తనిఖీలు

- 8 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు రూ.13వేల జరిమానా



యజమానికి జరిమానా విధిస్తున్న అధికారులు

జనగామ: జిల్లా కేంద్రంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు బుధవారం ఫుడ్‌సేఫ్టీ, మునిసిపల్ అధికారులు సంయుక్తంగా హోటళ్ల, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో తినుబండారాల తయారీ, భద్రత తదితర అంశాలకు సంబంధించి పరిశీలించారు. ఆహార పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్ కుమార్ హెచ్చరించారు. నిర్వహణ సిబ్బందికి క్యాప్స్, డ్రెస్ కోడ్‌తో పాటు చేతులకు గ్లౌజులు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. 8 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు రూ.13వేల జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులి శేఖర్, శానిటరీ జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

23 నుంచి నిట్‌లో టెక్నోజియాన్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు టెక్నోజియాన్–25ను నిర్వహించనున్నారు. ఈనెల 22న టెక్నోజియాన్–25 ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పాపయ్యపేటలో వృద్ధుడి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆవుల వెంకన్న (60)కు మానసిక స్థితి బాగలేదు. అంతేకాకుండా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఎల్లంల గ్రామంలో వ్యక్తి..


వాసు (ఫైల్)

జనగామ రూరల్: ఆర్థిక ఇబ్బందులతోఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఎల్లంల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బీర్రు వాసు(55) చేనేత వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణ నిమిత్తం సుమారు రూ.20లక్షలు అప్పు చేశాడు. అయితే అప్పు తీర్చలేక మార్గం కనిపించకపోవడంతో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి


అజయ్ (ఫైల్)

బయ్యారం: విషజ్వరంతో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జగ్గుతండాలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. తండాకు చెందిన చెందిన గోలి సుబ్బారావు కుమారుడు అజయ్(15)కి 10 రోజుల క్రితం విషజ్వరం వచ్చింది. దీంతో మహబూబాబాద్, వరంగల్‌లోని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అయినా తగ్గలేదు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. కాగా, అజయ్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

సైబర్ మోసం..

- యాప్ రివ్యూ పేరుతో డబ్బు కొల్లగొట్టిన కేటుగాళ్లు

మహబూబాబాద్ రూరల్ : టెలిగ్రామ్ యాప్ రివ్యూ పేరుతో సైబర్ నేరగాళ్లు డబ్బు కొల్లగొట్టారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. సెప్టెంబర్ 27వ తేదీన సైబర్ నేరగాళ్లు మహబూబాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు వాట్సాప్ ద్వారా టెలిగ్రామ్ యాప్‌లో రివ్యూలు ఇస్తే డబ్బులు వస్తాయని లింకులు పంపించారు. ఆ లింక్ ద్వారా యాప్‌లో జాయిన్ అవ్వగా రివ్యూ చెప్పాలంటే రూ.12 వేలు పంపాలని సైబర్ నేరగాళ్లు చెప్పగా బాధితుడు పంపాడు. అనంతరం మరో రూ.38 వేలు పంపాడు. మరోసారి రూ.60 వేలు పంపించాలని అడగగా బాధితుడికి అనుమానం వచ్చింది. వాళ్లు చెప్పిన విధంగా పంపినా తన ఖాతాలో జమ చేయకుండా ఇంకా డబ్బులు అడుగుతున్న విషయాన్ని గుర్తించాడు. తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించి వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుత్ వినియోగం తగ్గింది..

- గతేడాదితో పోలిస్తే భారీగా తగ్గిన డిమాండ్
- ఈ ఏడాది అక్టోబర్ మొదటి వారంలో మొత్తం విద్యుత్ వినియోగం 385.910 మిలియన్ యూనిట్లు
- గత సంవత్సరం ఇదే వారంలో 542.574 మిలియన్ యూనిట్ల వినియోగం





అక్టోబర్ మొదటి వారంలో విద్యుత్ వినియోగం, డిమాండ్ వివరాలు..

తేదీ	విద్యుత్ వినియోగం		విద్యుత్ డిమాండ్	
	2025సం.	2024 సం.	2025సం.	2024సం.
1	54.818	81.203	3094	4406
2	56.808	79.554	3397	4526
3	58.423	72.445	3383	4115
4	62.222	78.714	3674	4276
5	55.576	79.616	3325	4322
6	48.365	76.555	2856	4214
7	49.698	74.489	2840	4129

విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో), డిమాండ్ (మెగావాట్లలో)

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగం చాలా తగ్గింది. ఈ మేరకు డిమాండ్ కూడా పడిపోయింది. వరుసగా వర్షాలు కురవడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. వర్షాలతో వ్యవసాయ పంటలకు భూగర్భ జలాలు తోడడానికి విద్యుత్ మోటార్ల వినియోగం తగ్గింది. వాతావరణం చల్లబడడంతో గృహాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం నిలిచింది. దీంతో విద్యుత్ వినియోగం పడిపోయింది. ఈ మేరకు విద్యుత్ డిమాండ్ కూడా తగ్గింది. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో మొత్తంగా ఈ సంవత్సరం అక్టోబర్ 1 నుంచి 7వ తేదీ వరకు 385.910 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరిగింది. 2024 అక్టోబర్ 1 నుంచి 7వ తేదీ వరకు 542.574 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. అదే విధంగా ప్రస్తుత సంవత్సరం ఈ నెల 1 నుంచి 7 వరకు 22,569 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, 2024 అక్టోబర్ 1 నుంచి 7 వరకు 29,988 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. దీంతో భారత ఇంధన ఎక్చేంజ్‌లో విద్యుత్ యూనిట్ కొనుగోలు ధర కూడా కనిష్ఠ స్థాయికి పడిపోయిందని అధికార వర్గాలు తెలిపాయి.

ట్రాఫిక్ నియంత్రణకు కలిసి పనిచేద్దాం

- సీపీ సన్‌ప్రీత్ సింగ్


మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం : ట్రాఫిక్ నియంత్రణతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ ట్రై సిటీ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను అధిగమించేందుకు బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సీపీ సన్‌ప్రీత్ సింగ్ ట్రాఫిక్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నగరంలో పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్ల ఆక్రమణలు, ప్రధాన మార్గంలో వాహనదారులకు ప్రమాదకంగా మారిన గుంతల మరమ్మతులు చేపట్టాలన్నారు. వడ్డేపల్లి, కాళోజీ సెంటర్, తెలంగాణ జంక్షన్, మడికొండ చౌరస్తా, మరో రెండు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన రోడ్లపై వ్యాపార సైన్ బోర్డుల తొలగింపుతోపాటు వ్యాపార సముదాయాల్లోని సెల్లారుల్లోనే వాహనాలు పార్క్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, రోడ్లపై వినియోగంలో లేని కరెంట్, టెలిఫోన్ స్తంభాల తొలగించడం, వర్షాకాలంలో వరద రోడ్లపై నిలిచి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలిగే ప్రాంతాల్లో ఆ నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు గుంతలు పడిన ప్రాంతాలతోపాటు డివైడర్ల ఎత్తున పెంపు ప్రాంతాలకు సంబంధించి పూర్తి వివరాలు ట్రాఫిక్ అధికారులు అందజేయాలన్నారు. సమావేశంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకన్న, సుజాత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తులు

దీపావళి సందర్భంగా కమిషనరేట్ పరిధిలో తాత్కాలిక బాణసంచా విక్రయాలతోపాటు బాణసంచా నిల్వ చేసుకొనేందుకు అనుమతి కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు ఈనెల 16వ తేదీలోపు సంబంధిత జోన్లకు చెందిన డీసీపీ స్థాయి అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. దరఖాస్తు ఫామ్‌తో తప్పనిసరిగా అగ్నిమాపక అధికారులు జారీచేసిన ఎన్‌ఓసీతోపాటు, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేస్తే అధికారులు, యజమానుల అనుమతి పత్రాలు తీసుకోవాలన్నారు. స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అదాలత్ శాఖలో రూ.800 బ్యాంకు చలాన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలగోపాల్ గొప్ప మానవతావాది


మాట్లాడుతున్న నల్సార్ యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్


పాల్గొన్న పరిశోధకులు, విద్యార్థులు తదితరులు

- హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు
- కేయూలో బాలగోపాల్ స్మారకోపన్యాసం

కేయూ క్యాంపస్: మానవ హక్కుల నేత బాలగోపాల్ రాజ్యాంగాన్ని ప్రజాసాధికారతకు ఆయుధంగా ఉపయోగించి క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను పునర్నిర్మాణం చేసే యత్నం చేశారని, ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ(ఏపీసీఎల్‌సీ)తో అనుబంధంగా ఉండి ఖైదీల హక్కుల కోసం, బాధిత కుటుంబాలకు న్యాయ సాయం కోసం నిరంతరం పనిచేశారని హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ (వీసీ) ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలో సెనేట్‌హాల్‌లో డాక్టర్ కె . బాలగోపాల్ 15వ స్మారకోపన్యాసం 'కాన్స్టిటిట్యూషనల్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. బాలగోపాల్ అసాధారణ గొప్ప మానవతావాది అన్నారు. ఆయన రచనలు ఎకామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రికలో ప్రజాజీవితానికి దగ్గరగా ఉండేవన్నారు. బాల గోపాల్ 21వ శతాబ్దపు ప్రత్యేక బహుముఖ ప్రజ్ఞాశాలి అని అభివర్ణించారు.

బాలగోపాల్ స్ఫూర్తి కొనసాగించాలి..

బాలగోపాల్ దృక్పథం సమాజ కేంద్రంగా ఉంటుందని, దీనిని నేటి యువత కొనసాగించాలని ప్రముఖ సామాజికవేత్త, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యుడు జి. హరగోపాల్ అన్నారు. ప్రస్తుతం పుస్తక పఠనం తగ్గడం బాధాకరమన్నారు. న్యాక్ మాజీ డైరెక్టర్ ఆచార్య శివలింగప్రసాద్ మాట్లాడుతూ కేయూ గోల్డెన్ జూబ్లీలోకి అడిగిన సమయంలో బాలగోపాల్ స్మారక ఉపన్యాసం నిర్వహించడం అభినందనీయమన్నారు. కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బాలగోపాల్ కేయూ పూర్వ విద్యార్థి, అలాగే పూర్వ అధ్యాపకుడిగా విశ్వవిద్యాలయంలోనూ భాగమయ్యారని గుర్తు చేశారు. కాగా, బాలగోపాల్ రచించిన వివిధ పుస్తకాలను ఆయన సతీమణి వసంత లక్ష్మి, మానవహక్కులనేత జీవన్‌కుమార్ కేంద్ర గ్రంథాలయానికి అందజేశారు. విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, సామాజిక ఉద్యమ ప్రతినిధులు పరిశోధకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వనదేవతల హుండీ ఆదాయం రూ.27 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ కానుకల హుండీ ఆదాయం రూ.27,00,177 వచ్చినట్లు ఈఓ వీరస్వామి తెలిపారు. బుధవారం మేడారంలోని ఎండోమెంట్ డార్మెటరీ భవనంలో హుండీలను సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారుల సమక్షంలో లెక్కించారు. సమ్మక్క హుండీ ఆదాయం రూ.15,16,975, సారలమ్మ రూ.10,96,025, గోవిందరాజు రూ.41,956, పగిడిద్దరాజు 36,321, నోట్లు రూ.8,900 మొత్తం ఆదాయం రూ.27,00,177 వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు పాల్గొన్నారు. కాగా, అమ్మవార్ల హుండీ ఆదాయం ఈసారి తగ్గింది. వర్షాలు, గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మేడారానికి భక్తుల రద్దీ తగ్గడంతోనే ఈసారి ఆదాయం తగ్గినట్లు పూజారులు భావిస్తున్నారు.

డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు ఫీజుల పెంపు


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల్లో (2025–2026) ప్రవేశాలు పొందిన ఫస్టియర్ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఫీజులు భారీగా పెంచారు. ఈ మేరకు ఆయా ఫీజుల వివరాలను ప్రైవేట్ కళాశాలలకు కూడా సమాచారం అందించారు. ఒక్కో విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫీజు గతంలో రూ. 80 ఉండగా ఇప్పుడు రూ. 1,200కు పెంపుదల చేశారు. రికగ్నిషన్ ఫీజు గతంలో రూ. 400 ఉండగా ఇప్పుడు రూ. 800కు, ఐయూడీఎఫ్ ఫీజు గతంలో రూ. 60 ఉండగా ఇప్పుడు రూ. 300కు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు గతంలో రూ. 50 ఉండగా ఇప్పుడు రూ. 200కు పెంపుదల చేశారు. ఒక్క పరీక్ష ఫీజు మాత్రం రూ. 750 గతంలో మాదిరిగానే యథావిధిగా ఉంచారు. గతంలో ఒక్కో విద్యార్థి ఆయా అన్ని రకాల ఫీజుల కింద రూ. 1,340 చెల్లించేవారు. ఇప్పుడు ఏకంగా ఆయా ఫీజులు అన్ని కలిపి రూ.3,250కి పెంపుదల చేశారు. గతంలోకంటే ఒకేసారి ఒక్కో విద్యార్థిపై రూ. 1,910ఫీజు భారం మోపారు. ఒకేసారి ఇంత భారీ మొత్తంలో పెంచిన ఫీజులతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

పెంచిన ఫీజులు తగ్గించాలని వినతి..

కేయూ పరిధిలో డిగ్రీకోర్సుల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు భారీగా పెంచిన వివిధ రకాల ఫీజులను తగ్గించాలని బుధవారం పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు.. రిజిస్ట్రార్ రామచంద్రాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయా ఫీజుల స్ట్రక్చర్‌ను రివైజ్ చేయాలని విన్నవించారు.

లారీ డ్రైవర్‌కు ఆరునెలల జైలు

రఘునాథపల్లి: ఒకరి మృతికి కారణమైన ఓ లారీ డ్రైవర్‌కు జనగామ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి. శశి ఆరు నెలల జైలు, రూ 2,500 జరిమానా విధిచినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ బుధవారం తెలిపారు. మండలంలోని ఇబ్రహీంపూర్ శివారు దర్గతండాకు చెందిన సునావత్ నాగరాజు 2018, ఏప్రిల్ 21న తన బైక్‌పై గుగులోత్ జమిలి, అంజితో కలిసి ఫంక్షన్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా మండల కేంద్రంలోని యూసఫ్ పెట్రోల్ బంక్ వద్ద నార్కట్‌పల్లికి చెందిన మేడబోయిన నాగరాజు లారీని నిర్లక్ష్యంగా నడిపి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగరాజు, జమిలి, అంజికి తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రంజిత్‌రావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎస్సై నరేశ్, కోర్టు కానిస్టేబుల్ బొట్టు వెంకటేష్, ప్రాసెస్ కానిస్టేబుల్ సాయికృష్ణ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్‌కుమార్ కేసు వాదించారు. న్యాయమూర్తి.. నిందితుడికి అరు నెలల జైలు శిక్ష, రూ. 2,500 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

కూలీ కళ్లు పోయేలా చేసిన మరోకూలికి మూడేళ్ల జైలు..

మహబూబాబాద్ రూరల్ : ఓ కూలీ కళ్లు పోయేలా చేసిన ఘటనలో తోటి కూలీ(సహచరురాలు)కి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ బుధవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి సంపత్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ పట్టణం గొల్ల బజారుకు చెందిన చిత్తలూరి సుశీల 2012, ఆగస్టు 14న కూలి కోసం జిల్లా కేంద్రానికి వచ్చింది. పని ముగిసిన తర్వాత ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు వీరభద్రం తల్లి ఆచూకీ కోసం గాలింపు చేపట్టాడు. ఈ క్రమంలో వారికి తెలిసిన ఓ వ్యక్తి వచ్చి సుశీల మానుకోట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వెంటనే వీరభద్రం ఆస్పత్రికి వచ్చి తల్లి సుశీలను పరిశీలించగా ఆమె కళ్లు పోయినట్లు వైద్యులు పేర్కొన్నారు. అదే రోజున మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజ్యలక్ష్మి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇందులో నెల్లికుదురు మండలం వావిలాలకు చెందిన కొల్లూరి సరోజన అనే తోటి కూలీ.. సుశీల కళ్లలో చెట్టు పసరు పోసినట్లు నిర్ధారణకు వచ్చారు. అనంతరం 2012, సెప్టెంబర్ 10న కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అప్పటి సీనియర్ సివిల్ జడ్జి (సబ్ కోర్టు జడ్జి) శ్రీనివాస్ నాయక్ నేరం నిరూపణకాబడిన సరోజనకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. శిక్ష పడిన అనంతరం నేరస్తురాలు బెయిలుపై బయటకు వచ్చాక మళ్లీ 2018లో జిల్లా కోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఏడు సంవత్సరాలపాటు కోర్టులో కేసు నడవగా ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య వాదనలు వినిపించగా డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీడీఓ సంపత్ రెడ్డి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ.. నేరస్తురాలు సరోజనకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

అక్కడ తప్పించుకున్నారు.. ఇక్కడ పట్టుబడ్డారు

- ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.20.50 లక్షల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ నర్సింహారావు


మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహారావు

హసన్‌పర్తి: మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పించుకున్న గంజాయి విక్రయదారులు హనుమకొండలో పట్టుబడ్డారు. వారి నుంచి సుమారు రూ.20.50 లక్షల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ నర్సింహారావు మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోచ్‌బెహార్‌కు చెందిన రాణాహుస్సేన్ వృత్తిరీత్యా పెయింటర్. సులువుగా డబ్బులు సంపాదించేందుకు తన గ్రామంలో ఉంటున్న గంజాయి వ్యాపారి కృష్ణచంద్ర బర్మన్‌ను ఆయన సంప్రదించాడు. నాలుగు నెలల క్రితం తన వద్ద ఉన్న డబ్బులతో గంజాయిని ఖరీదు చేసి రైలు ఎక్కి సికింద్రాబాద్ చేరుకున్నాడు. సరుకుని ఇక్కడ విక్రయించినట్లు ఏసీపీ చెప్పారు. ఆ తర్వాత వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈవిషయాన్ని తన చిన్ననాటి స్నేహితుడు నూర్ మహ్మద్ మియాకు వివరించాడు. దీంతో నాలుగు రోజుల క్రితం ఇద్దరు చేరో లక్ష రూపాయల చొప్పున సమకూర్చుకున్నారు. గంజాయి వ్యాపారి కృష్ణచంద్ర నుంచి సుమారు 41 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈనెల 4న రైలులో పశ్చిమబెంగాల్ నుంచి సికింద్రాబాద్‌కు పయనమయ్యారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పోలీసుల తనిఖీల నుంచి వారు తప్పించుకున్నారు. అక్కడి నుంచి బస్సులో హనుమకొండ బస్టాండ్, తర్వాత ముచ్చర్ల క్రాస్‌లోని జాతీయ రహదారికి చేరుకున్నారు. లారీ ఎక్కి సికింద్రాబాద్‌కు వెళ్లే క్రమంలో పోలీసులకు చిక్కినట్లు ఏసీపీ నర్సింహారావు చెప్పారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని రూ.20.50 లక్షల విలువైన 41 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. గంజాయి విక్రయదారులను పట్టుకోవడంతో అత్యంత ప్రతిభ కనబరిచిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై కల్యాణ్‌కుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు షురూ

- క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,191
- తొలి రోజు 3వేల బస్తాల రాక



మార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ అధికారులు బుధవారం కొత్త పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. బహిరంగ వేలం నిర్వహించగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,191 పలికింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌కు చెందిన రైతు టి.నరేశ్ 10 బస్తాల పత్తిని తీసుకొచ్చాడు. 28 శాతం తేమ ఉండడంతో క్వింటాలుకు రూ.7,191 ధరతో అరవింద్ ట్రేడర్ ద్వారా లక్ష్మీప్రద ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు మార్కెట్ గ్రేడ్ 2 కార్యదర్శి ఎస్.రాము తెలిపారు. సుమారు 3వేల బస్తాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, సాగర్ల శ్రీనివాస్, మార్కెట్ అధికారులు అంజిత్‌రావు, రాజేందర్, స్వప్న, సలీం తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు చేస్తేనే రైతులకు లాభం..

పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తే అదనంగా ధర పలికి రైతులు ఆదాయం పొందుతారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో సీసీఐ కఠిన నిబంధనలు పెట్టడంతో జిన్నింగ్ మిల్లల యజమానులు టెండర్లు దాఖలు చేయలేదు. దీనివల్ల అధికారులు బహిరంగ వేలంతో మార్కెట్‌లో కొత్త పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ రంగంలోకి వస్తే గరిష్ట మద్దతు ధర రూ.8,110 ఉండి క్వింటాల్‌కు రూ.500 అధికంగా గిట్టుబాటు అయ్యే అవకాశాలున్నట్లు రైతులు అంటున్నారు. నిబంధనలపై మిల్లర్లతో చర్చలు జరిపి సీసీఐ కొనుగోళ్లు చేపట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జేఎన్ఎస్‌లో బాక్సింగ్ ఎంపికలు


తలపడుతున్న బాక్సర్లు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్–17 బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి 150 మంది బాలబాలికలు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెలిశెట్టి ప్రశాంత్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు హనుమకొండలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్–17 బాలబాలికల కన్వీనర్ శీలం పార్థసారథి, భూపాలపల్లి డీవైఎస్ఓ రఘు, పీఈటీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భోగి సుధాకర్, ఒలింపిక్స్ సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మంచాల స్వామిచరణ్, పీడీలు సుభాశ్ కుమార్, సురేశ్, ప్రేమ్, నాగరాజు, బాక్సింగ్ కోచ్‌లు దేవరకొండ ప్రభుదాస్, సందెల శ్యాంసన్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల స్థానిక సమస్యలు పరిష్కరించాలి

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు


మాట్లాడుతున్న వీఎస్.రావు

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఫెడరేషన్ కరీంనగర్ జోనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాట కార్యక్రమాన్ని తీసుకోనున్నట్లు తెలిపారు. యాజమాన్యం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా విద్యుత్ బస్సుల కొనుగోళ్లను సంస్థకే అప్పగించి సంస్థతోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పని భారం తగ్గించి ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవీందర్ రెడ్డి, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ లింగమూర్తి, ఉపాధ్యక్షుడు సి.హెచ్.రామచంద్రం, నాయకులు ఎల్లయ్య, ఉపేంద్రాచారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ పెచ్చులు మీదపడి వ్యక్తికి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న మహమ్మద్ అలీ

కాజీపేట: భవనం పైనుంచి సిమెంట్ పెచ్చులు పడడంతో ఓ బేకరీలో ఆహార పదార్థాలు కొనుగోలు చేసి బయటకు వస్తున్న కస్టమర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కాజీపేట చౌరస్తాలోని ట్రిబుల్ ఎస్ కాంప్లెక్స్‌కు యజమానులు ఎలాంటి జాగ్రత్తలు చేపట్టకుండా కొద్ది రోజులుగా మరమ్మతులు చేపడుతున్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అలీ(59) తమ బంధువుల పిల్లల కోసం బేకరీలో ఆహార పదార్థాలు కొనుగోలు చేసి బయటకు వస్తున్నాడు. ఈ క్రమంలో పైనుంచి సిమెంట్ పెచ్చులు మహమ్మద్ అలీ కాలిపై పడడంతో పూర్తిగా ఛిద్రమైంది. దీంతో అలీ కేకలు వేయగా స్పందించిన బాటసారులు 108లో ఎంజీఎం తరలించారు. కాగా, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేసిన భవన యజమానులపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గోవిందరావుపేట : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈఘటన బుధవారం మండలంలోని పస్రాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పస్రాలో నిర్మిస్తున్న రైస్ మిల్లు పనుల్లో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు బహుగూడ యాదవ్ (20) వెల్డింగ్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. సహకార్మికులు స్పందించి వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.